# వింతస్పర్శ

నా బుగ్గ కందిపోయింది. ఎన్నడూ ఇలా జరగలేదు. జరిగిన ఈ అకాల చర్య నుంచి నేనింకా తేరుకోలేకపోతున్నాను.

మాకు పెళ్లయిన ఇన్నాళ్ల తరువాత ఆయన తొలిసారిగా ఇంత మొరటుగా ప్రవర్తించడం విడ్డూరంగా, అయోమయంగా ఉంది.

బుగ్గను తడుముకుంటున్నాను. మంటగా ఉంది. ఆయన అరచేతి అచ్చు ఉబ్బెత్తుగా తగులుతోంది. కళ్లల్లో నుంచి నీళ్లు చిమ్ముతూనే ఉన్నాయి.

ఎంతో పొందికైన ఆయన ఎందుకింత దురుసుగా ఈరోజు నాపట్ల వ్యవహరించారో నాకు ఎంతకూ అర్థంకావడంలేదు.

ఆయన నా బుగ్గ వాయించే అంతటి ఘటన ఏదీ మా మధ్యన చోటుచేసుకోలేదాయే. మరి ఎందుకు ఆయన అలా ప్రవర్తించారో?!

ఆయన రసగుళికలా మెసులుకు వస్తుండడంతో ఆయన పట్ల నాకు ఎంతో అనురాగం క్షణంక్షణం పెరిగి పెరిగి ధీమాతనాన్ని ఒడగట్టింది. కేవలం తన ఆలనతో ఎంతో తొందరగా ఆయన నావాళ్ల వైపు నుంచి నా దృష్టిని మరల్చగలిగారు. ఆయన భార్యనైనందుకు పొంగి మురిసిపోయాను.

అంతటి మనిషి అయిన ఆయన ఎందుకు ఉదయం అంత తొందరపాటుగా వ్యవహరించారో నాకు అంతుచిక్కడంలేదు.

నిశ్చితార్థం అయిన మరునాటి నుంచే ఆయన నాతో సెల్‌లో మాట్లాడారు. పెళ్లిరోజు వరకు ప్రతిరోజు – రోజుకు ఒకమారు చొప్పున అదీ కూడా చక్కగా నాలో మనోనిబ్బరం పెంచే మాటలే వల్లించేవారు. అలాగే తనూ నాతోడుగా ఉంటాననే భరోసా ధ్వనించేవారు. ఎంతో కమ్మగా మాట్లాడేవారు.

ఎంతగానో తటపటాయిస్తూనే నా శరీరాన్ని సుతిమెత్తగా ఆక్రమించుకుంటుండేవారో కదా.

అంతటి వ్యక్తి ఉదయం అంత వెగటుగా ఎలా వ్యవహరించారో!

ఆఫీసు నుంచి ప్రతి గంట గంటకు నాతో సెల్‌లో మాట్లాడందే ఉండలేని ఆయన ఉదయం అంటూ ఆఫీసుకు వెళ్లిపోయిన ఆయన ఇంతవరకూ నా సెల్ మోగించలేదు. చిత్రంగా ఉంది.

ఉదయం నిద్ర నుంచి లేచిన దగ్గరనుంచే ఆయన మూడీగా ఉన్నారు. తరచి తరచి కారణం అడగడమే నా తప్పా! అందుకే అంతగా ఆయన నా బుగ్గ వాయించారా! నేను నమ్మలేకపోతున్నాను. అంతటి చిన్నదానికి ఆయన నాపై చేయిచేసుకోరు. నాకు ఆయన తెలుసుగా. ఎందుకు కొట్టారో ఎంతగా అడిగినా చెప్పక, టిఫిన్ చేయక ఆఫీసుకు విసురుగా వెళ్లిపోయారు.

విషయం తేలక నేను నివ్వెరపాటుతో కొట్టుమిట్టాడుతున్నాను.

ఎప్పటిలాగే చాలా చక్కగా రాత్రి కూడా

బత్తుల వెంకట దుర్గాప్రసాదరావు

నావద్ద ఆయన మెసులుకున్నారు.

తెల్లారి లేచింది లగాయితు ఆయన వింతగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. నాలో కలవరం పెంచుతూనే హటాత్తుగా నా బుగ్గ వాయించారు. నన్ను నిర్దాక్షణ్యంగా వదిలి ఆఫీసుకు పోయారు.

ఏమిటీ వింత? ఏ చర్య లేనిదానికి ఇంతటి దారుణ ప్రతిచర్య ఎందుకు?

ఉక్కిరిబిక్కిరిల నుంచి తేరుకుంటూనే ఆలోచనల్లో పడి సతమతమవుతున్న నేను మెల్లిగా తేరుకుంటూనే ప్రస్తుతంలోకి వచ్చాను.

ఆయనకు లంచ్ తయారుచేయలేదు.

లంచ్‌కి వస్తారుగా. వస్తే కారణం కొరకు నిలదీయాలని గట్టిగా అనుకున్నాను.

ఇంకా స్నానం చేయలేదు. జరిగిన అనుకోని ఘటనకు ఇంతవరకు చతికిలబడిపోయాను. చిరాగ్గా ఉంది. లేచివెళ్లి స్నానం చేసాను. మనసు తేలికయిన భావం నన్ను ఊరడించింది. వంటగదిలోకి నడిచాను. సింపుల్‌గానే లంచ్ తయారుచేసాను.

లంచ్ టైమ్ గడిచిపోయింది. ఆయన ఇంకా రాలేదు.

నా సెల్‌తో ఆయన సెల్‌కి కనెక్ట్ అయ్యాను.

“ఏమిటి?” ఆయన గొంతు ఖంగుమంది.

“లంచ్‌కి ఇంకా రాలేదేమిటి?” అడిగాను కంగారుగా.

“రాను” అంటూ సెల్ కనెక్షన్ కట్ చేసేసారు.

గతుక్కుమన్నాను. కళ్లల్లో నీళ్లు చోటు చేసుకున్నాయి వెంటనే. భారంగా వెళ్లి మంచం మీద వాలిపోయాను.





ఆలోచనలు వేడెక్కిస్తున్నాయి.

నన్ను వంటరిగా వదిలి ఆయన అలా ప్రవర్తించడం నన్ను ఎంతగానో కలవరపరుస్తోంది. ఏం చేయాలో తేల్చుకోలేకపోతున్నాను.

ఇంటికి ఫోన్‌చేసి అమ్మనుగాని, నాన్ననుగానీ సలహా అడగనా? అన్నయ్యకు ఫోన్‌చేసి వాడినిగాని, వదిననుగానీ సలహా అడగనా?

ఏమిటో ఏమీ తేల్చుకోలేకపోతున్నాను.

ఎందుకో తొందరపడలేకపోతున్నాను.

తర్జనభర్జనల మధ్య కాలం ఇట్టేగడిపేసాను.

డోర్‌బెల్ మోగడంతో ఉలికిపాటుతో తేరుకున్నాను...

సాయంకాలం కూడా దాటి చీకటి పడిపోయింది. లైట్లు వెలిగించాను. తలుపు తీసాను.

ఆయన లోనికి వచ్చారు. తలుపు మూసి గడియవేసారు విసురుగా. నన్ను పట్టించుకోకుండా గదిలోకి నడిచారు. నేను ఆయన వెనుకే వెళ్లాను. మవునంగా నిలబడ్డాను.

ఆయన డ్రస్ మార్చుకున్నారు. బాత్‌రూంలోకి దూరారు.

ఆయన బాత్‌రూంనుంచి రాగానే "ఫో, నా ఎదుట నువ్వు ఉండకు"అన్నారు నాతో కటువుగా.

నేను బెంబేలు పడిపోయాను.

"చెప్తుతోంది నీకే. ఫో" అన్నారు ఆయన చాలా నిర్దయగా.

నేను తల్లడిల్లిపోతున్నాను.

"నా వలన ఏం తప్పు జరిగిందో నాకు తెలియడంలేదండి" అన్నాను చాలా సహనంగా, ఆత్రంగా.

"చాల్లే. ఫోఫో" అన్నారు విసురుగా.

ఉదయం నుంచి ఆహారం లేక, పైగా ఆయన ప్రవర్తనకు విషయం తేలక నాలో నిస్సత్తువ మరింత చిక్కనవుతోంది.

ప్రయత్నంతో "టిఫిన్‌లేదు, లంచ్‌లేదు... త్వరగా డిన్నర్‌చేసి పెడతాను".

"అక్కరలేదు. నేను బయట తిన్నాను" చెప్పారు ఆయన అదోలా.

బేలగా ఆయన వంక చూస్తూండిపోయాను.

"ఏమిటా చూపు. పోయి నువ్వు మెక్కు".

ఏమిటి ఈయన ఇలా ప్రవర్తిస్తున్నారు? మరోసారి అనుకున్నాను. జవాబు రాక తల్లడిల్లిపోతున్నాను.

"నేను నిద్రపోవాలి. ఈ గది నుంచి ఫో" అన్నారు ఆయన.


నేను ఏదో మాట్లాడబోగా –

"ఇంకో గది ఉందిగా ఫో" అన్నారు. గది తలువు వద్దకు వచ్చి – నువ్వు పోతే నేను తలుపు వేసుకుంటానన్నట్లు నుంచుని.

నాకు తల తీసేసినట్లయింది. అప్రయత్నంగానే కదిలాను. నేను ఆ గది దాటగానే ఆయన గది తలుపు గమ్మున మూసేసారు.

నా మరో చెంప ఛెళ్లుమన్నట్లు కదిలిపోయాను. అదిరిపోయిన నేను మరో గదిలోకి పరుగున పోయి మంచంమీద వాలిపోయాను. మళ్లీ భోరున ఏడ్చాను.

ఆయన మీద చెప్పరానంత కోపం నాలో లావాలా పొంగుకువచ్చింది.




'ఛీ, ఏమిటి ఇతను. ఇలా మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారు' అని అనుకున్నానో లేదో ఒక్కమారుగా ఆయన మీద ఏవగింపు పొడచూపింది. ఆయన పట్ల కసి పెరిగింది. పళ్లునూరాను.

కలతలో అలసి ఎప్పుడు, ఎలా నిద్రపోయానోకానీ నన్ను ఎవరో కుదిపినట్లు కావడంతో ఉలిక్కిపడి లేసాను.

ఆయన...

"ఎలాగే నిద్రపోతున్నావు" అని అడిగారు పిచ్చిగా నన్ను కుదిపేస్తూ.

నేను చిర్రెత్తిపోయాను ఆయన వాలకానికి. విసురుగా లేచి దూరంగా జరిగాను. బెంబేలుగా ఆయనను చూస్తున్నాను.

"ఏమిటే ఆ చూపు. ఆ..." అంటూ ఆయన నా వైపు విసురుగా వచ్చారు. నేను పక్కకు అంతే వేగంగా కదిలాను.

ఏమిటి ఇతను ఇలా నన్ను గేలి చేస్తున్నారు అనుకున్నాను అంతలోనే.

ఆయన దురుసుతనం నన్ను భయపెడుతోంది. తమాయించుకోలేక పోతున్నాను. మేక మీదకు లంఘించిన పులిలా అగుపిస్తున్నారు ఆయన నాకు ఇప్పుడు.

"ఏమిటే పరాయివాడినైపోయానా నేను, ఎందుకే అలా తప్పించుకుంటున్నావు" అంటూ ఆయన నామీదకు ఉరికారు. నన్ను అమాంతంగా పట్టుకున్నారు.

ఆయన ప్రవర్తన నాకు అసహ్యంగా అనిపిస్తోంది. తడబడుతూనే విడిపించుకోవడానికి తంటాలు పడుతున్నాను. ఆయన మొండివైఖరి నన్ను కలవరపెడుతోంది. చిరాకు పుట్టిస్తోంది.

పచ్చిగా చెప్పాలంటే నన్ను బలత్కరించే ప్రయత్నంలో ఉన్నారు ఆయన.

ఇదేమిటి... ఈయన... ఛ...

నేను నిజంగా చిర్రెత్తిపోతున్నాను. దానిని

అగుపరుస్తున్నాను కూడా. అయినా ఆయన లెక్కచేయడంలేదు. ఆయన సొద ఆయనదే...

ఆయన నుండి తప్పించుకోలేనని గ్రహించ గలిగాను. పెనుగులాటకు మరి నేను తాళలేను.

గుండెనిండా గాలి పీల్చుకున్నాను అతి ప్రయత్నంతో. ఒక్క ఉదుటున ఆయనను విదిలించాను. ఆ ప్రయత్నంలో ఆయన చెంప ఛెళ్లుమంది.

అంతే ఆయన నన్ను వదిలేసారు.

నేను ఉన్నచోటనే కూలబడిపోయాను. ఆయన గదిలోంచి బయటకు వెళ్లిపోయారు.

నాకు అంతా అయోమయంగా ఉంది.

ఒకపక్క తన్నుకు వస్తున్న ఏడుపు, మరో పక్క పరిపరి ఆలోచనలు నా మనసును దొలుస్తున్నాయి.

కాలం ఎలా గడిచిందో కానీ ఆ రాత్రి ముగిసి తెల్లవారిపోయింది. తల విదిలించుకున్నాను.

ఆయన ఉనికిని పట్టించుకోబుద్ధి కావడం లేదు.

నీరసంగా ఉంది. అస్తవ్యస్తంగా ఉన్న చీరను సరిచేసుకోబోతున్నప్పుడు ఒడిలోని కాగితం నా కంటబడింది.

దానిని చూసాను - అనాలోచితంగానే. దానిలో ఏదో వ్రాసి ఉంది. అది ఆయన దస్తూరీ. చదవనారంభించాను - మామూలుగా.

"డియర్, నేను నీ పట్ల రఫ్‌గా, వల్గర్‌గా ప్రవర్తించాను. స్త్రీని బలవంతంగా అనుభవిస్తే ఆ అనుభూతి ఎలా ఉంటుందోనన్న కోరిక నాలో బలీయంగా ఉంది. అందుకే నిన్ను బలవంతంగా అనుభవిస్తే పోలే అన్న హేతువతో నేను అలా ప్రవర్తించాను. కానీ నా ఆలోచన తప్పు... పరమ నీచమని... అనుభవంతో తెలుసుకున్నాను. పైగా నిన్ను, నీ మనసును ఎంతగానో గాయపరిచాను. ఇప్పుడు ఎంతో ఆవేదన అనుభవిస్తున్నాను. నీ ఎదుటపడ్డానికి సిగ్గుపడుతున్నాను. నాది క్షమించరాని తప్పే. నీ నుంచి ఏ నిర్ణయం వచ్చినా దానిని మనసారా గౌరవిస్తాను. కానీ చివరగా... మరలా మరలా మనసారా కోరుకుంటున్నాను... దయతో నన్ను క్షమించవూ..." అని ఉంది.

మరోసారి ఆయన రాసింది చదివాను... మరోసారి చదివాను... క్రమంగా నన్ను నేను సముదాయించుకోగలిగాను.

ఆయన తలంపు చెడ్డదైనా, ఆయన 'ఆ అనుభూతి'ని పొందడానికి నన్నే ఉపయోగించుకోబోయినందున ఆయన 'నీతిమంతుడే' అనుకోగలిగాను... సమాధానపడ్డాను. ఆయన ప్రవర్తనకు కారణం తెలిసింది. లేచాను. గదిలో నుంచి బయటకు వచ్చాను. హాలులో సోఫాలో ఆయన కనిపించారు. తలదించుకుని ఉన్నారు. జాలేసింది. అటు కదిలాను ప్రేమగా. ●

## గమనిక

సాహిత్య కార్యక్రమాల ఫొటోలు ప్రచురణార్థం పంపించేటపుడు ఆ కార్యక్రమం జరిగిన తేది, స్థలం తప్పక ఉదహరించాలి. ఈ వివరాలు లేకుండా వచ్చే ఫొటోలు ప్రచురణకు స్వీకరించబడవని గమనించగోర్తాం.

- ఎడిటర్